క్లుప్తంగా

శీత్లా పండుగ



పూజలు చేస్తున్న గ్రామస్తులు

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్‌తండాలో మంగళవారం శీత్లా పండుగ నిర్వహించారు. వర్షాలు కురిసి పాడి,పంటలు బాగుండాలని గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు.

అక్రమ కట్టడంపై నోటీసు జారీ

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి పంచాయతీ శివారు వ్యవసాయ భూమిలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న రైస్‌మిల్లుకు పంచాయతీ కార్యదర్శి నరేశ్‌కుమార్ నోటీసు జారీ చేశారు. మంగళవారం నోటీసును మిల్లు సూపర్‌వైజర్‌కు అందించారు. మిల్లు యజమాని అయిట్ల సుదర్శన్ నిర్మాణానికి సంబంధించి మూడు రోజుల్లో అనుమతి తీసుకోవాలని సూచించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



నీటిని పారబోస్తున్న వైస్ చైర్మన్, సిబ్బంది

ఖానాపూర్: ప్రతి ఒక్కరూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోశ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఒకటో వార్డులో డ్రై డేలో భాగంగా మున్సిపల్, వైద్య సిబ్బందితో పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కాలనీవాసులు, సిబ్బంది ఉన్నారు.

'పోరాటాల ఫలితమే బెనిఫిట్స్ పెంపు'

ఖానాపూర్: తమ దీర్ఘకాలిక పోరాటాల ఫలితంగానే అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రాష్ట్ర ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచుతామని ప్రకటించిందని టీఎన్‌జీవోఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గుడిసె సంపూర్ణ అన్నారు. మంగళవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్‌కు రూ.లక్ష చొప్పున రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రకటించడం హర్షనీయమని పేర్కొన్నారు. ఇతర సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

'బాలకార్మికులను పనిలో పెట్టుకోవద్దు'

ఖానాపూర్: బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ అండ్ లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈసందర్భంగా బాలకార్మికులు పనిలో ఉన్న చోట్ల దుకాణాల యజమానులకు అవగాహన కల్పించారు. ప్రొటెక్షన్ అధికారి శ్రీనివాస్, సోషల్ వర్కర్ నరేందర్, అవుట్ రిచ్ వర్కర్లు లక్ష్మణ్, మమత, కానిస్టేబుల్ చిన్నయ్య ఉన్నారు.

గోరింటాకు వేడుకలు

నర్సాపూర్(జి): ఆషాఢమాసం పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. గోరింటాకుతో కలిగే ప్రయోజనాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

అభ్యసన సామగ్రి తయారు చేయాలి

ఖానాపూర్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు బోధించేందుకు టీచర్లు అభ్యసన సామగ్రిని తయారు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. మంగళవారం మండలంలోని సుర్జాపూర్–2 కేంద్రంతోపాటు ఎస్సీ కాలనీలోని కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు పోషకాహారం అందించాలన్నారు. ఎప్పటికప్పుడు పిల్లల బరువు, ఎత్తులు వివరాలను నమోదు చేయాలని పేర్కొన్నారు. కేంద్రాల్లో తప్పనిసరిగా న్యూట్రిషన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రమాదకర గుంత పూడ్చరూ..



గుంత కన్పించేలా ఏర్పాటు చేసిన కర్ర

సోన్: మండలంలోని పాక్‌పట్ల గ్రామం నుంచి గాంధీనగర్ వెళ్లే మార్గంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డుపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. దీంతో రాకపోకలకు ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చివేయాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇక నాణ్యమైన విద్యుత్..

- గంగాపూర్ జీపీలో నూతన సబ్‌స్టేషన్
- రూ.3 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- 22 గ్రామాలకు తీరనున్న లోఓల్టేజీ కష్టాలు



అల్లంపల్లిలో రాత్రి మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది(ఫైల్)



స్థలం పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

కడెం: మండలంలోని మారుమూల అటవీ గ్రామాలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు గంగాపూర్ పంచాయతీ పరిధిలోని దత్తోజీపేట్‌లో నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటు కానుంది. సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.మూడు కోట్లను మంజూరు చేసింది. ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో కడెం మండలంలోని గంగాపూర్, రాణిగూడ, కొర్రతండా, అల్లంపల్లి, బాబానాయక్‌తండాతోపాటు పెంబి మండలంలోని దొందారి గ్రామానికి నాణ్యమైన విద్యుత్ అందనుంది. ఇటీవల విద్యుత్‌శాఖ అధికారులు సబ్‌స్టేషన్ ఏర్పాటుకు దత్తోజీపేట్‌లో స్థలం పరిశీలించారు. త్వరలో టెండర్ ప్రక్రియ మొదలుపెట్టి పనులు ప్రారంభించనున్నారు.

22 గ్రామాలకు..

మండలంలోని గంగాపూర్, రాణిగూడ, కొర్రతండా, లక్ష్మీపూర్, మొర్రిపేట్, దత్తోజీపేట్, అల్లంపల్లి బాబానాయక్ తండా, మీసాలభూమన్నగూడెం, చింతగూడ, గంగన్నపేట్, మంగల్‌సింగ్ తండా, పాలరేగడి, తదితర 22 గ్రామాలకు ఈ సబ్‌స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరా కానుంది. ప్రస్తుతం ఈ గ్రామాలకు ఖానాపూర్ మండలంలోని భీర్నంది సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. విద్యుత్ లైన్ అటవీ ప్రాంతం గుండా ఉండటంతో వర్షాకాలంలో, ఈదురుగాలుల సమయంలో తరచూ ఇబ్బందులు తలెత్తేవి. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో లోఓల్టేజీ సమస్యలు తలెత్తుతున్నాయి. తరచుగా విద్యుత్ అంతరాయంతోపాటు సరఫరాలో హెచ్చుతగ్గులు ఉండటంతో వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయి.

అభివృద్ధికి దోహదం..

నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటుతో మారుమూల అటవీ గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. సబ్‌స్టేషన్ ఏర్పాటుతో రైస్‌మిల్లులు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, వెల్డింగ్ షాపులు, బ్రిక్స్ ఇండస్ట్రీస్, తదితర పరిశ్రమల ఏర్పాటుతో స్థానికులకు ఉపాధి దొరుకుతుంది. సబ్‌స్టేషన్ ఏర్పాటుతో కడెం మండలంలోని అల్లంపల్లి, పెంబి మండలంలోని దొందారి గ్రామాల్లో మిషన్ భగీరథ పంపుహౌస్‌లకు కరెంట్ కష్టాలు తప్పనున్నాయి.

మా కష్టాలు తీరనున్నాయి



ఏళ్లుగా నాణ్యమైన కరెంటు కోసం ఎదురుచూస్తున్నాం. విద్యుత్ సరఫరా సరిగా లేక తరచుగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయి. సబ్‌స్టేషన్ ఏర్పాటుతో మా కష్టాలు తీరన్నాయి. – గంగారెడ్డి, అల్లంపల్లి

స్థలం పరిశీలన చేశాం



గంగాపూర్ పంచాయతీలోని దత్తోజీపేట్‌లో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.మూడు కోట్లు మంజూరు చేసింది. ఇటీవల స్థల పరిశీలన చేశాం. స్థలం విద్యుత్‌శాఖకు అప్పగించాక టెండర్ ప్రక్రియ ప్రారంభిస్తాం. – కొట్టి శ్రీనివాస్, ఏడీఈ, ఖానాపూర్

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

లోకేశ్వరం: గ్రామాల్లో రెండున్నర ఏళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు వారి తల్లిదండ్రులు పంపించాలని అంగన్‌వాడీ టీచర్లు కోరారు. మంగళవారం అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని వీధుల గుండా చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారం, నాణ్యమైన విద్య అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ భోజన్న, కార్యదర్శి వినయ్‌సాయి, అంగన్‌వాడీ టీచర్లు సునీత, సుజాత, సురేఖ, ఆశవర్కర్ నంద కుమారి ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి, మునిపెల్లి, పొట్టపెల్లి(కే) తదితర గ్రామాల్లో మంగళవారం అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పిస్తూ ఆయా గ్రామాల్లో ర్యాలీ తీశారు. ఈనెల 20 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి.. చివరిరోజైన శనివారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం ఏర్పాటు చేసినట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



లోకేశ్వరంలో ర్యాలీ తీస్తున్న టీచర్లు



లక్ష్మణచాంద: మునిపెల్లిలో ర్యాలీ



ఖానాపూర్‌లో..

ఖానాపూర్: రెండున్నరేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని బర్కత్‌పుర, రాజీవ్‌నగర్ తదితర చోట్ల అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వరలక్ష్మి, ఆర్ విజయలక్ష్మి, తదితరులున్నారు.

ఆదమరిస్తే అంతే..



ముథోల్ నుంచి ధర్మాబాద్‌కు వెళ్లే రోడ్డు దుస్థితి

- ముథోల్ మండలంలో అధ్వానంగా రోడ్లు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ఆయా గ్రామాల ప్రజలు

ముథోల్: మండలంలోని గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఐదేళ్ల కింద ముథోల్ నుంచి ధర్మాబాద్ వెళ్లే మార్గంలో బీటీ రోడ్డు వేశారు. ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గతేడాది భారీ వర్షాలకు అక్కడక్కడా రోడ్డు కొట్టుకుపోయింది. మండలంలోని ముథోల్–ఆష్టా రోడ్డు, విఠోలితండా–బోరిగాం రోడ్డు వర్షాలకు గుంతలమయంగా మారింది. వాహనదారులు గుంతలను తప్పించే క్రమంలో అదుపు తప్పి కింద పడుతున్నారు. రాత్రి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

పట్టించుకోని పాలకులు..

రోడ్డు సమస్య పరిష్కరించుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులను పలుమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. రోడ్డుపై కేజ్‌వీల్స్‌తో కూడిన ట్రాక్టర్లు వెళ్తుండటంతో గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డును పరిశీలించి మరమ్మతులు చేయించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

అధికారులు మరమ్మతులు చేపట్టాలి..



ముథోల్ నుండి ధర్మాబాద్‌కు వెళ్లే రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేపట్టాలి. ముథోల్ నుండి బిద్రెల్లి వయా ధర్మాబాద్ వెళితే 20కి.మీ. కానీ ఈ రోడ్డు నుంచి వెళ్తే కేవలం 8కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. రోడ్డు అధ్వానంగా మారడంతోరాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. – అమృత్‌పటేల్, వడ్తాల

కాంట్రాక్టర్లు ముందుకు వస్తలేరు

ముథోల్ నుండి ధర్మాబాద్‌కు వెళ్లే రోడ్డు మరమ్మతుల కోసం రూ.15లక్షలు మంజూరయ్యాయి. పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు వస్తలేరు. త్వరలో పనులు ప్రారంభించి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటాం. – చందు, పీఆర్ డీఈ

బాధిత కుటుంబాలకు పరామర్శ



సోన్‌లో పరామర్శిస్తున్న మల్లారెడ్డి

సోన్: మండల కేంద్రంలో మాజీ ఉపసర్పంచ్ రాము తండ్రి, మాదాపూర్ గ్రామంలో నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం బాధిత కుటుంబసభ్యులను బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అల్లూరి మల్లారెడ్డి పరామర్శించారు. వారి వెంట కాంగ్రెస్ నిర్మల్ మండల అధ్యక్షులు ఎంబరి గంగాధర్, సామాజిక కార్యకర్త శంకర్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: మున్సిపాలిటీలో జవాన్‌గా పని చేసే కూరన్నపేట్‌కు చెందిన కుంటల పోశెట్టి మంగళవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ కౌన్సిల్ సభ్యులతో మృతుడి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

మున్సిపల్ సిబ్బందికి..

ఖానాపూర్: తేనెటీగల దాడిలో గాయపడిన మున్సిపల్ సిబ్బందిని మంగళవారం మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు పరామర్శించారు. పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలోని క్షతగాత్రులను వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సంతోశ్, కౌన్సిలర్లు, నాయకులు జన్నారపు శంకర్, కిశోర్‌నాయక్, నాయిని సంతోశ్, అమానుల్లాఖాన్, షబ్బీర్‌పాషా, కమిషనర్ మనోహర్ తదితరులున్నారు.

పండరీపూర్ పాదయాత్రలో మండలవాసులు

తానూరు: మహారాష్ట్ర అలంధి నుంచి పండరీపూర్‌కు ఏటా నెలరోజుల పాటు నిర్వహించే పాదయాత్రలో తానూరు మండలంలోని వార్‌కరి భక్తులు పాల్గొంటున్నారు. బోరిగాం, ఉమ్రి(కే), నంద్‌గాం, సింగన్‌గాం, తానూరు, కోలూరు, బెంబర గ్రామాల నుంచి వార్‌కరి భక్తులు పాదయాత్రలో పాల్గొని విఠలరుక్మాబాయిని దర్శించుకొని తిరిగి వస్తారు. పాదయాత్రలో వార్‌కరి భక్తులు చంద్రకాంత్‌యాదవ్, గంగాధర్ యాదవ్, ఆయా గ్రామాల వార్‌కరి భక్తులు తదితరులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

లోకేశ్వరం: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీవో సోలమాన్ రాజ్ అన్నా రు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. వారి వెంట ప్రిన్సిపాల్ అనసూయ, కార్యదర్శి వినయ్‌సాయి ఉన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ప్ర భుత్వ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం మండల ప్రత్యేకాధికారి, డీఏవో అంజిప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా వసతిగృహ ఆవరణలో మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించాలని విద్యార్థులకు సూ చించారు. వసతిగృహ సంక్షేమాధికారి భాస్కర్, ఏఈఓ గణేశ్ పాల్గొన్నారు.

చదువులో రాణిస్తేనే ఉన్నత భవిష్యత్

- ఖానాపూర్ సీఐ సైదారావు



మాట్లాడుతున్న సీఐ సైదారావు

పెంబి: విద్యార్థులు చెడువ్యసనాలకు దూరం ఉంటూ చదువులో రాణిస్తేనే ఉన్నత భవిష్యత్ ఉంటుందని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. మంగళవారం మండలంలోని కోసగుట్ట ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో గంజాయి, గుట్కా, డ్రగ్స్, మద్యం వంటి చెడు వ్యసనాలతో కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో గేమ్‌లు ఆడుతూ సైబర్ నేరగాళ్లు పంపే లింక్‌లపై క్లిక్ చేస్తే బ్యాంక్ ఖాతాలో ఉన్న డబ్బులు పోతాయని అన్నారు. అపరిచితులకు ఓటీపీలు, ఆధార్ వివరాలు చెప్పవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెంబి ఎస్సై శంకర్, సిబ్బంది రాజు, లాలు, గోవింద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేటి నుంచి ఉపాధి తనిఖీ గ్రామసభలు

లోకేశ్వరం: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభలను మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఈనెల 17 నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సోలమాన్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24న మండల పరిషత్ కార్యాలయ అవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థల సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు. ఈనెల 17న కిష్టాపూర్‌లో సామాజిక గ్రామసభ, 19న పోట్‌పల్లి, రాయపూర్‌కాండ్లీ, హావర్గ, పుస్పూర్, గాడిసెరా, సాథ్‌గాం, 20న కన్కపూర్, గడ్‌చాంద, నగర్, పిప్రి, 21న రాజూర, నర్సింహానగర్, 22న బిలోలి, జోహర్‌పూర్, హద్‌గాం, 23న సేవాలాల్‌తండా, అబ్దుల్లాపూర్, బామ్నికే, బాగాపూర్, లోకేశ్వరం, ధర్మోర, పంచగుడి, మన్మద్, 24న వట్టోలి గ్రామాల్లో గ్రామసభలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉపాధి కూలీలు, రైతులు ఆయా గ్రామాల్లో నిర్వహించే సభల కు తప్పనిసరిగా హాజరవాలని కోరారు.

గ్రామాల్లో పీరీల ఊరేగింపు



కల్లూర్‌లో పీరీలను ఊరేగిస్తున్న గ్రామస్తులు



మునిపెల్లిలో మలిదలు సమర్పిస్తున్న భక్తులు

కుంటాల: మొహర్రం పండుగ పురస్కరించుకొని మండలంలోని కల్లూర్ గ్రామంలో మంగళవారం పీరీల ఊరేగింపు నిర్వహించారు. డప్పు, వాయిద్యాల నడుమ పీరీలను ఊరేగించగా భక్తులు దట్టీలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. అగ్నిగుండం వద్ద అలాయ్‌భలాయ్ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

పీరీలకు మలిదల సమర్పణ

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి, పార్‌పెల్లి, మల్లాపూర్, లక్ష్మణచాంద తదితర గ్రామాల్లో పీరీలకు మలిదలు సమర్పించారు. అంతకుముందు పీరీల ఊరేగింపు నిర్వహించగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అగ్నిగుండం వద్ద ఉంచి పూజలు చేశారు. అనంతరం మలిదలను పీరీలకు సమర్పించారు.



తానూరు: కోలూరులో..

తానూరు: మండలంలోని కోలూరుతోపాటు తదితర గ్రామాల్లో మంగళవారం భక్తిశ్రద్ధలతో పీర్ల పండగ నిర్వహించారు. రాత్రి పీరీలను ప్రతిష్ఠించి ఉత్సవాలను జరుపుకొన్నారు. భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యార్థుల కోసం బస్సు ప్రారంభం

సారంగపూర్: మండలంలోని సోనాపూర్, అర్కాయితండా, గోపాల్‌పేట్ గ్రామాలకు చెందిన 70 మంది విద్యార్థులు ఇదే మండలంలోని చించో లి(బి) ఉన్నత పాఠశాలకు వెళ్లేందుకు ఆర్టీసీ అధికారులు బస్సు ఏర్పాటు చేశారు. మంగళవారం సదరు బస్సుకు పూజలు చేసి ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఉన్నత పాఠశాల లేకపోవడంతో విద్యార్థులు ప్రైవేటు వాహనాల్లో చించోలి(బి)ఉన్నత పాఠశాలకు వెళ్లేవారు. ఈవిషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు, చించోలి(బి) ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రమేశ్ ఇటీవల డయల్‌యువర్ డీఎం కార్యక్రమంలో భాగంగా డీఎంకు ఫోన్ చేసి సమస్య వివరించారు. అనంతరం డీఎంకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆర్టీసీ అధికారులు బస్సు ప్రారంభించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



సోనాపూర్‌తండాలో ప్రారంభిస్తున్న గ్రామస్తులు

నేడు ఏకాదశి వేడుకలు

కుంటాల: మండలంలోని ఓలాశ్రీ విఠలేశ్వర, రుక్మాబాయి ఆలయంలో బుధవారం నుంచి ఏకాదశి వేడుకలు నిర్వహించనున్నట్లు రుక్మిణీ సహిత పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయ, గందె పరివార సభ్యులు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 6 గంటలకు పంచామృతం మహాభిషేకం, అష్టోత్తరశత, తులసి పుష్పార్చన, 9 గంటలకు సామూహిక విష్ణు సహస్ర పారాయణం, మధ్యాహ్నం 12 గంటలకు సామూహిక సత్యనారాయణ వ్రతారంభం, 2 గంటలకు సామూహిక కుంకుమార్చన, 3 గంటలకు అఖండ నామస్మరణ, సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపాలంకరణ, 7 గంటలకు పల్లకిసేవ, 7:30 గంటలకు హారతి, మంత్రపుష్పం, గురువారం ఉదయం 7గంటలకు కాగడ హారతి, 12 గంటలకు అన్నదానం ఉంటుందన్నారు.



విఠలరుక్మాబాయి దేవతామూర్తులు

మొక్కలు నాటి సంరక్షించాలి

తానూరు: మొక్కలు నాటి సంరక్షించాలని ఈజీఎస్ ఏపీవో గంగాధర్ సూచించారు. మంగళవారం మండలంలోని మహలింగి గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా కూలీలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణ, ప్రభుత్వ ఖాళీస్థలాలు, రోడ్లకు ఇరువైపుల మొక్కలు నాటించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో టీఏ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, ఉపాధిహామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని మలక్‌చించోలి మల్లన్న ఆలయంలో నాటేందుకు రూ.10వేల విలువైన మొక్కలను అదే గ్రామానికి రాజేశ్వర్‌గౌడ్ మంగళవారం గ్రామస్తులకు అందించారు. ఎర్రచందనం, మామిడి మొక్కలు, రావి, మర్రి, వేపతోపాటు పూల మొక్కలను నాటించారు. కార్యక్రమంలో గ్రామస్తులు రవి తదితరులు ఉన్నారు.



సారంగపూర్: మొక్కలు నాటిస్తున్న రాజేశ్వర్